క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెన్నారావుపేట : మరమ్మతుల దృష్ట్యా నేడు (మంగళవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నర్సంపేట డీఈ శ్రీధర్, చెన్నారావుపేట ఏఈ జోగానంద్ సోమవారం తెలిపారు. చెన్నారావుపేట, లింగగిరి, ఉప్పరపల్లి 34కేవీ ఫీడర్లలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు చెన్నారావుపేట మండలంలోని అన్ని 33/11 కేవీ ఉప కేంద్రాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక



దుగ్గొండి : మండలంలోని బంధంపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ యూత్ గ్రామ అధ్యక్షుడు హింగె విక్రమ్, మాజీ వార్డు సభ్యుడు మొగులోజు రాజు, అంకిల్ల రామచంద్రు, చిమ్మని రమేష్‌లకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

డీఏలు విడుదల చేయాలి

రాయపర్తి : పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ గఫార్ కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని కోరారు. మండల అధ్యక్షుడు ఆవుల రవీందర్, ప్రధాన కార్యదర్శి గాదె ప్రవీణ్‌రెడ్డి, పారుపల్లి సమ్మారెడ్డి, ప్రసాదరావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఖానాపురం : మండలంలోని పలు గ్రామాలకు చెందిన 85 మందికి రూ.24.79లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ సీఎం సహాయ నిధితో అనేక మంది జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. వైద్య చికిత్సలు చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందిపడే వారు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంటే ఎమ్మెల్యే దొంతి సహకారంతో అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలగందుల రాజు, కావటి రమేష్, మీసం రవీందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియామకం


కొమ్మ శ్రీకాంత్

నర్సంపేట : బీసీ పవర్ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నర్సంపేటకు చెందిన కొమ్మ శ్రీకాంత్‌ను సోమవారం బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ నియమించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకుడు మచ్చిక రాజుగౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు వరగంటి కవిత, డివిజన్ మహిళా అధ్యక్షురాలు గాదం స్వప్నయాదవ్, డివిజన్ నాయకులు బాల్నె సుభాష్, పట్టణ అధ్యక్షుడు సనత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



నర్సంపేట : మహిళలు ఆర్థికంగా ఎదగాలని డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పాకాల మహిళా బ్యాంకులో హృదయ స్పందన హోప్ సేవా సొసైటీ నిర్వాహకుడు పెండెం శివానంద్ ఆధ్వర్యంలో రెండు నెలలుగా నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన 50మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. హృదయ స్పందన హోప్ సేవా సొసైటీ సేవలను అభినందించారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా చేపట్టే కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పాకాల మహిళా బ్యాంకు ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. పాకాల మహిళా బ్యాంకు అధ్యక్షురాలు పెండెం రాజేశ్వరి, ఇమ్మడి పద్మ, గుడిశాల వనజ, మాణిక్యం, కీసరి విజయ, దేవులపల్లి వాణి, పూజారి ప్రసన్న, టీచర్ రమాతో పాటు మహిళలు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ఆరోగ్య రక్షణ

- పరిసరాల శుభ్రత పాటించాలని వైద్యుల సూచన
- మురుగు నీరు నిల్వకుండా చూసుకోవాలి


వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సరోజ


పాపయ్యపేటలో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

చెన్నారావుపేట : వర్షాకాలం ప్రారంభమైందంటే ప్రజల్లో భయం పుడుతుంది.. ఎందుకంటే అది వ్యాధుల కాలం. ఈ కాలంలో వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తుంటాయి. ముఖ్యంగా జ్వరాలు, జలుబు, డయేరియా, డెంగీ, చికున్ గున్యా, ఇతర సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడుతుంటారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో డయేరియా, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, కాచి చల్లార్చిన నీరు తాగడం, వైద్యుల సూచనలు, సలహాలు పాటించడంతోపాటు పిల్లలు, పెద్దవారు కూడా ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చవని వైద్యులు సూచిస్తున్నారు.

ఇంటి వద్ద తయారు చేసినవే తినిపించాలి..

ప్రాథమిక స్థాయిలో పిల్లల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. వర్షంలో తడవడానికి, నిల్వ ఉన్న నీటిలో ఆటలు ఆడేందుకు ఇష్ట పడుతుంటారు. బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే తినుబండారాలను ఎక్కువగా తింటుంటారు. ఇటువంటి అలవాట్ల వల్ల పిల్లల ఆరోగ్యం త్వరగా దెబ్బతింటుంది. కాబట్టి ఇంటి దగ్గర తయారు చేసినవే పిల్లలకు ఆహారంగా ఇవ్వాలి. ముఖ్యంగా తాగు నీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి.

పారిశుద్ధ్య లోపంతోనే..

జ్వరాలు ప్రబలడానికి ముఖ్య కారణం పారిశుద్ధ్య లోపం. ఎక్కడ చూసిన డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం పడిన సమయంలో మురుగునీరు వర్షం నీటితో కలిసి రహదారులపై ప్రవహిస్తోంది.

ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రతి రోజు వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. జ్వర బాధితుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేస్తున్నారు. ప్రజలను సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం చేయడానికి ఐకేపీ ఆధ్వర్యంలో, పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

పరిశుభ్రత తప్పనిసరి



వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత తప్పకుండా పాటించాలి. ఇంటి పరిసరాల్లో మురుగు, చెత్తా చెదారం నిల్వ ఉండకుండా చూసుకోవాలి. మురుగు నిల్వ ఉంటే దోమలు, ఈగలు వ్యాప్తిచెంది డయేరియా, డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. తల్లిదండ్రులు పిల్లలతో జాగ్రత్తగా ఉండాలి.

– సరోజ, పీహెచ్‌సీ వైద్యురాలు

సమస్యల పరిష్కారానికి కృషి

- కేజీబీవీని సందర్శించిన ఎమ్మెల్యే నాగరాజు


వంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సోమవారం స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వంటశాలను పరిశీలించి భోజనం నాణ్యతగా ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థినులకు బోధన బాగా చేస్తున్నారా అని అడిగారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. అనంతరం జూనియర్ కళాశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ప్రహరీతో పాటు చిన్నపాటి సమస్యలు ఉన్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థినులు తెలుపగా వెంటనే ఆయన స్పందించి సమస్యలను వెంటనే తీర్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, నాయకులు నరుకుడు వెంకటయ్య, పోశాల వెంకన్న, కమ్మగోని ప్రభాకర్, శ్రీపాద సతీష్, యాదగిరి, యరుపట్ల సాయికుమార్, అక్బర్, కొండేటి బాలకృష్ణ, ఎంపీడీఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులుగా యువతకే అధిక ప్రాధాన్యం కల్పించి మెజార్టీ గ్రామాలను కైవసం చేసుకుంటామని బీజేపీ జిల్లా నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఇప్పల్‌తండా గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి రాణాప్రతాప్‌రెడ్డి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బానోత్ అశోక్, ధరావత్ సురేందర్, బానోత్ అనిల్, బానోత్ అశోక్, ధరావత్ ప్రవీణ్, ధరావత్ శరత్, రవి, తదితరులు ఉన్నారు.

విజయ దండోరా ప్రజా ప్రదర్శన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నర్సంపేట : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుకు కృతజ్ఞతగా నర్సంపేట పట్టణంలో ధర్మ విజయ దండోరా ప్రజా ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అమరవీరుల స్తూపం నుంచి బస్టాండ్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గాద ఇషాక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, ఎంఎస్పీ నియోజకవర్గ కోకన్వీనర్ తడుగుల విజయ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, బోయిన్ నారాయణ, చింతం సిద్దులు మాట్లాడారు. ర్యాలీలో బొచ్చు రఘుపతి, బాణాల రమేష్, మాదాసి సదానదం, మంద ప్రకాశ్, కల్లెపల్లి సురేష్, మునిగే యాకూబ్, మాదాసి బాబు, వేల్పుగొండ రాజు, బాణాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలతోనే ఎస్సీ వర్గీకరణ


సమావేశంలో మాట్లాడుతున్న యాకయ్య

నెక్కొండ : ఎస్సీ వర్గీకరణ తీర్పు అమరవీరుల త్యాగ ఫలమేనని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు ఈదునూరి యాకయ్య అన్నారు. మండలం కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పుకు మంద కృష్ణకుగాని, బీజేపీకి గాని ఎలాంటి సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు. వర్గీకరణ చేస్తామని బీజేపీ మోసం చేసిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ నేతలు, సుప్రీంకోర్టు న్యాయవాదులు కపిల్‌సిబాల్, సల్మాన్ ఖుర్షీద్‌లు వాదనలతో వర్గీకరణ తీర్పు వెలువడిందన్నారు. నేడు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే అమరవీరుల సంస్మరణ సభకు మాదిగలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు తడుగుల జనార్దన్, జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం రమేష్, పంజాల యాకూబ్, శ్రీనివాస్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సూర్యతండాకు బస్సు సౌకర్యం కల్పించాలి


డీఎంకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

రాయపర్తి : మండలంలోని సూర్యతండా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సోమవారం తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతికి వినతిపత్రం అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ.. గ్రామంలో 2వేల జనాభా ఉందని అవసరం నిమిత్తం తమ గ్రామం నుంచి వెళ్లాలంటే 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెర్కవేడుకు నడిచి వెళ్లి అక్కడి నుంచి ఎప్పుడో ఒక్కసారి వచ్చే బస్సు లేదా ఆటోలో రాయపర్తి, తొర్రూరు, వరంగల్‌కు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. స్కూళ్లు, కళాశాలలకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ డీఎంకు వినతిపత్రం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు మూనావత్ శంకర్ నాయక్, శ్రీను, మంత్రు ఉన్నారు.

ప్రకృతి పండుగ 'తీజ్'


తీజ్ బుట్టలతో మహిళలు

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని 15వ వార్డులో తీజ్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జాటోత్ ఉదయ్‌సింగ్, పూజారి గౌరవ అధ్యక్షుడు జాటోత్ జేతురాం నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తీజ్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రకృతి పండుగ తీజ్ సందర్భంగా గోధుమ గింజలను తొమ్మిది రోజుల పాటు బుట్టలో పెంచి ప్రతీ రోజు ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకలు నిర్వహిస్తామన్నారు. పెళ్లి కాని ఆడ పిల్లలతో పవిత్రమైన గంగా నీటితో గోధుమ నారును పెంచడం జరుగుతుందన్నారు. తొమ్మిదవ రోజు సేవాలాల్ మహరాజ్‌కు నైవేద్యం సమర్పించి నెయ్యితో అగ్నిహోత్రికి హోమం నిర్వహించడం ఆచారమన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ధరావత్ వీరన్న, జాటోత్ చందర్ సింగ్, గుగులోత్ బాలాజీ, ధరావత్ కీర్య, గుగులోత్ సుధాకర్, ధరావత్ దస్రు, బోడ లాలు, భూక్య వీరన్న, ధరావత్ భీమా, సారయ్య, ధరావత్ భిక్షం, భూక్య రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్యతోనే జీవనోపాధి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ శ్రుతి

సంగెం : భవిష్యత్‌లో కంప్యూటర్ విద్య జీవనోపాధికి ఊతం ఇస్తుందని విద్యార్థులు కంప్యూటర్ విద్యను శ్రద్ధగా నేర్చుకోవాలని దాత బోయినపల్లి శ్రుతిఅనిల్‌రావు అన్నారు. పుట్టిన ఊరిలోని ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్లు బహూకరించారు. మండలంలోని కాపులకనిపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐ బోయినపల్లి శృతి-అనిల్‌రావు దంపతులు 2017లో పాఠశాలకు 10 కంప్యూటర్లు, ప్రొజెక్టర్‌ను అందజేయడంతో పాటుగా నెలనెల వేతనం ఇస్తూ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించారు. సోమవారం దాత శృతి తన కూతుళ్లు శ్రీపా, అనియాలతో కలిసి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంత వరకు నేర్చుకున్నారో పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి గోపాల్‌రావు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు సీతాదేవి, ఉపాధ్యాయులు రాజన్న, వెంకటేశ్వర్లు, స్వప్నకుమారి, రవీందర్, రతన్‌సింగ్ రాథోడ్, అశోక్, నాయకులు సారంగం, రవికుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య


దోపతి ఎల్లయ్య (ఫైల్)

వర్ధన్నపేట: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. వర్ధన్నపేటకు చెందిన దోపతి ఎల్లయ్య (60) గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం కుడికాలు మడిమకు ప్రమాదవశాత్తు దెబ్బ తగలడంతో నరం చితికిపోయింది. దీంతో ఎల్లయ్యకు కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించి సిమెంట్ పట్టి వేయించారు. నెల తర్వాత ఆస్పత్రికి తీసుకెళ్లగా మరో నెలపాటు సిమెంట్ పట్టి వేసి పంపించారు. సిమెంట్ పట్టితో కాలు నొప్పి తాళలేక సోమవారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయ పనులకు వెళ్లిన ఆయన భార్య వెంకటలక్ష్మి ఇంటికి రాగా ఎల్లయ్య ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు అశోక్ ఉన్నాడు.

పోరాట ఫలితమే స్వేచ్ఛ


సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి శుద్ధిచేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నర్సంపేట : ఎంతోమంది స్వాతంత్య్ర సమరయోధుల పోరాట ప్రాణత్యాగాల ఫలితమే ఈ స్వేచ్ఛ జీవితమని భారతీయ జనతా పార్టీ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబుగౌడ్ అన్నారు. ఈ మేరకు నర్సంపేట పట్టణంలో బీజేపీ నాయకులు సోమవారం హర్ ఘర్ తిరంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి విగ్రహాన్ని పాలతో శుద్ధి చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి పుల్లారావు, వరంగల్ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బానోత్ వీరన్న, 17వ వార్డు కౌన్సిలర్ బోడ గోల్యానాయక్, కొంపెల్లి రాజేందర్, గూడూరు సందీప్, కూనమల్ల పృథ్వీరాజ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

చెన్నారావుపేట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు (ఎఫ్ఏ) పే స్కేల్ వర్తింప చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఫ్ఏలు, అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుగులోత్ మోహన్, నాయకులు కన్నం తిరుపతి, మద్రి సురేష్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సోమవారం సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..4,779 సర్క్యులర్‌ను రద్దు చేసి లిస్ట్ 3 ద్వారా ఉద్యోగాలు కోల్పోయిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. కనీస వేతనం రూ.35 వేలు అందించాలని, హెల్త్ కార్డులు, గతంలో పనిచేసి కోల్పోయిన 31 నెలల వేతనం ఇప్పించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. కర్ణాకర్, జంపాల రాజయ్య, తొప్పెట రమేష్, ఎఫ్ఏలు ఉన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న మార్నేని రవీందర్‌రావు

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాలకు చెందిన వంగాల చల్మారెడ్డి (65) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. కాగా స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు, రాష్ట్ర టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సోమవారం చల్మారెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన లోనె రాధాబాయి ఇటీవల మృతి చెందారు. బాధితులను ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోర్తాల చందర్‌రావు, రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్ సోమవారం పరామర్శించారు. హింగె భుజంగరావు, సుకినె రాజేశ్వర్‌రావు, ఇంగ్లీ శివాజీ, రవికుమార్, లాండే రమేష్ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



వర్ధన్నపేట : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని బాలవికాస ఏరియా కోఆర్డినేటర్ పిట్టల రాణి అన్నారు. బాలవికాస ఆధ్వర్యంలో సోమవారం వర్ధన్నపేట పట్టణంలోని న్యూ ఇండియా చర్చ్ ఆఫ్ గాడ్ ప్రాంగణంలో హనుమకొండలోని శ్రీలక్ష్మి నర్సింహ ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యశిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యురాలు డాక్టర్ నిఖిత, పీఆర్ఓ సుభాష్ పాషా, సిస్టర్లు ప్రసన్న, కృష్ణవేణి, ప్రతినిధులు ఫాతిమా, స్వాతి, అనురాధ, చందన పాల్గొన్నారు.

'మా భూమి మాకు ఇప్పించండి'

పర్వతగిరి : మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన బీసీ, ఎస్సీలకు ప్రభుత్వం కేటాయించిన భూమిని స్థానిక భూస్వామి తమ వద్ద నుంచి లాక్కున్నాడని పలువురు బాధితులు తెలిపారు. ఈ మేరకు 'మా భూమి మాకు ఇప్పించాలని' వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు.

చెరువు శిఖం పట్టాలు రద్దు చేయాలి

నల్లబెల్లి : మండలంలోని యాపలకుంట(ఎర్రకుంట), తుమ్మల చెరువు శిఖం భూములను అక్రమంగా పట్టా చేసుకున్న వాటిని రద్దు చేయాలని ఆయా చెరువుల ఆయకట్టు రైతులు సోమవారం వేర్వేరుగా తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా రైతులు సిద్దబోయిన సురేష్, ఎరుకల రవీందర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో అక్రమాలకు పాల్పడి రైతులు శిఖం భూములను పట్టా చేసుకున్నారని తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా నరేందర్ యాదవ్

సంక్షిప్త సమాచారం

నర్సంపేట : ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామానికి చెందిన నీలారపు నరేందర్ యాదవ్‌ను బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ సోమవారం నియామక పత్రం అందజేశారు.

చెన్నకేశవ ఆలయంలో ప్రత్యేక పూజలు

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరి గ్రామాన్ని ఎంపీడీఓ నల్ల శ్రీవాణి సోమవారం సందర్శించారు. ఈ మేరకు లింగగిరి గుట్టపై ఉన్న లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని కార్యాలయాన్ని సందర్శించి, నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఈసీ కిషోర్, పంచాయతీ కార్యదర్శి శ్యాంప్రసాద్, హెచ్ఎం పడిదం కట్టస్వామి, కారోబార్ దాసరి రమేశ్, ఏఎన్ఎం సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు పూలమ్మ, సాంబలక్ష్మి, ఆశ కార్యకర్తలు శ్రీలత, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి కృషి

ఖానాపురం : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ శివారు నుంచి రంగాపురం వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ప్రయాణికుల సౌకర్యార్థం రోడ్డుకు మరమ్మతు పనులను సోమవారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు.

జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ



చెన్నారావుపేట : స్వచ్ఛదనం-పచ్చదనం జిల్లా స్థాయి పోటీల్లో ఉప్పరపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు హెచ్ఎం జయ తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను గైడ్ టీచర్ గజవెల్లి సుందర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా మట్టెవాడ హైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని సీహెచ్ ద్రాక్షాయని ప్రథమ స్థానం, ఉపన్యాస పోటీలో 9వ తరగతి విద్యార్థిని రెడ్డబోయిన కీర్తన తృతీయ స్థానాన్ని సాధించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శశిధర్, సంతోష్‌కుమార్, బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మొగిళి, సుందర్, మాధవి, రమాదేవి, వర్దెల్లి సతీష్‌కుమార్, స్వప్న, జాహెద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల అభివృద్ధికి తోడ్పాటునందిస్తా..



నర్సంపేట : కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా ఎన్నికైన డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్‌ను సోమవారం నర్సంపేట డివిజన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందించారు. గూడెపు భిక్షపతి, సోనబోయిన సారంగపాణి, కందుల స్వామిగౌడ్, బానోత్ దేవిలాల్, ఈసాల లక్ష్మయ్య, గుగులోత్ భిక్షపతి, గొగ్గలి వెంకన్న, యాట రవికుమార్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నేడు లక్నెపల్లిలో వైద్యశిబిరం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామంలో నేడు (మంగళవారం) మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు బాంజీపేట వైద్యాధికారి అరుణ్ చంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్నెపల్లి గ్రామపంచాయతీ ఆవరణలోని ఉదయం 8.30గంటల నుంచి వైద్యశిబిరం ప్రారంభమవుతుందని, ఇందులో నర్సంపేట మెడికల్ కళాశాలకు చెందిన వివిధ విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు వస్తారని పేర్కొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



నల్లబెల్లి : సమగ్ర శిక్ష ఉద్యోగులకు భద్రత కల్పించాలని ఐక్య వేదిక గౌరవ అధ్యక్షుడు సుద్దాల ఆనందం అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, మరణించిన ఉద్యోగులకు వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వరి, విజయ్ కుమార్, భిక్షపతి, రవి, వెంకటయ్య, రాంబాబు, వీరాచారీ, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు